

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 72 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'గట్టిగా పట్టుకోండి' చెవులు చిల్లులు పడేలా అరిచాడు నాగాంజనేయాచారి. రెండు తెడ్లనూ కాలికింద వేసి తొక్కి పట్టాడు. రెండు చేతులతో పడవ అంచులను గట్టిగా వాటేసుకున్నట్లు పట్టుకున్నాడు.

'జయ రఘువీర సమర్థా! జై బజరంగ బలీ! జై భవానీ' అని శక్తి కొద్దీ అరుస్తూ గట్టిగా పడవ అంచును పట్టుకున్నది చిన్నారి లలిత. ప్రమాదంలో ఉన్నప్పుడు ధైర్యం కోల్పోకుండా ఉండాలట! నాన్నగారు చెప్పారు. ఇష్టమైన దేముడిని నమ్మకంగా తలుచుకోవాలట! కళ్ళు మూసుకుని ఆగకుండా 'జై బజరంగ బలీ! జై భవానీ!' అని బిగ్గరగా నినాదం చేస్తూనే ఉన్నది!

అంతెత్తున అలతో పాటు బొమ్మలాగా పైకి లేచిన పడవ ఊగి పోతున్నది! నీటి తుంపరలు వర్షపు చినుకులలాగా కురుస్తున్నాయి. రెండు చేతులతో గట్టిగా పడవను ఒడిసి పట్టుకుని 'యముడా దండాలు! యముడా దండాలు!' అని బిగ్గరగా ప్రార్థన చేస్తున్నాడు జాంబడు. 'మన కాటి కాపరులకు యమధర్మరాజే ఇలవేలుపు! ఆయన్నే నమ్ముకోవాలి మనం' అని తండ్రి చెప్పింది గుర్తుకొచ్చింది వాడికి. ఎలుగుబంటులా రెండు చేతులతో పడవ అంచును వాటేసుకుని బిగ్గరగా అరుస్తున్నాడు ఆగకుండా.

'రెడ్ ఓన్స్( మమ్మల్ని కాపాడు)ఊడాన్! (డచ్చి వారి సూర్య దేవుడు) రెడ్ ఓన్స్! ఊడాన్!' అని ప్రార్థిస్తూ గట్టిగా అంచును పట్టుకున్నాడు ఇర్మిన్. సూర్యుడిని మించిన దేవుడు లేడట!! తండ్రి చెప్పినది గుర్తుకొచ్చింది 'ఇర్మిన్'కి!

ఏ ప్రార్థన ఫలించిందో! ఏ దైవం కరుణించాడో! వారి తల్లి దండ్రుల అదృష్టమో, విధి విచిత్రమో! ఉవ్వెత్తున ఎగసి పడిన అలతో పాటే ఎగసి కిందకు పడింది పడవ. పక్కకు ఒరిగి పోనూ లేదు! తలక్రిందులూ కాలేదు! ఆ కుదుపుకు బొంగరంలా గిర్రున తిరుగుతూ కవ్వంతో చిలికినట్లు నీటిని చుట్టూ అంతెత్తున విరజిమ్మింది. ఆ ఉదుటుకు జాంబడు తప్ప అందరూ పట్టు తప్పి పడవలో ఒకళ్ళమీద ఒకళ్ళు పడిపోయారు. జాంబడిది భల్లూకపు పట్టు మరి.

ఒకటి రెండు నిముషాలపాటు అంతలోనే మెరుపులా వచ్చిన వరద అంతే వేగంతో మెరుపులా తగ్గిపోయింది. మున్నేటిలోని గండశిలలు ఇంతలోనే దర్శనమిచ్చాయి. మామూలుగా రెండు దరులనూ ఒరుసుకుంటూ పారుతున్న ప్రవాహంలో అడ్డంగా గిర్రున తిరుగుతూ ఎవరో లాగుతూ తీసుకెళ్లినట్లు ఊగుతూ వెళ్లి నిలువెత్తు రామ పాద శిలకున్న నెర్రెలో బలంగా ఇరుక్కుపోయింది. పిల్లల అరుపులు, కేకలు, హర్షధ్వానాలు ఆనందపు చిందులు మిన్ను ముట్టాయి. ఒడ్డున మహలు రక్షకులు ఆనందంతో వేసిన కేకలు స్థంభాద్రి నరసింహుడి కొండకు తగిలి ప్రతిధ్వనించాయి.

శోకంతో, దిగ్భ్రాంతితో చేతులలో ముఖం దాచుకుని విలపిస్తూ కూలబడిపోయిన దామోదరశర్మ ఆ కేకలకు కనులు తెరిచి చూశాడు. రెండు క్షణాలు నమ్మలేనట్లు చూస్తుండిపోయాడు. మరుక్షణం మెరుపులా లేచి ఉత్తరీయాన్ని నడుముకు చుట్టుకుంటూ మున్నేటిలోకి దూకాడు. ప్రత్యేకంగా చెప్పే పని లేకుండా మహలు రక్షకులు కూడా నీళ్ళలోకి పరుగులు పెట్టారు.

★★★★★★★★★★★★★★

భవానీద్వీపం అపూర్వమైన గాథా లహరికి అద్భుతమైన వేదిక అయ్యింది. కృష్ణమ్మ అలల చిరునవ్వులతో ఆనందంగా కరతాళధ్వనులు చేస్తున్నది. నీటి పక్షుల రెక్కల సదులు, ద్వీపంలోని అడవి జంతువుల అరుపులు జోడు వాయిద్యాలలా వంత పాడుతున్నట్లున్నాయి.

క్రమ క్రమంగా కనులముందు కదలాడుతున్న దృశ్యాలు, చెవులలో మారుమ్రోగుతున్న ధ్వనులు సద్దుమణిగి, నెమ్మదిగా తన శరీర స్పృహ, పరిసరాల ఉనికి అనుభూతం కావడం మొదలైంది కృష్ణరాయలకు. ఒక తరంగంలా, ఒక చిరు ప్రవాహంలా, సన్నని గాలి తెరలా కదలిక ఒకటి నడి నెత్తిన మొదలై వెన్నుపూస క్రింది దాకా పాకింది. మెరుపులా చిర చిర మన్న ధ్వనిలా అనుభూతి కలిగింది. వర్ణించడానికి వీలుకాని ప్రశాంతత నిండిపోయింది.

'రఘువీరుడి కరుణతో కాలచక్ర భ్రమణ కాంతులు కొన్ని చూశావు కృష్ణోబా! యిది కాలరహస్యం. భూత భవిష్యత్ వర్తమాన దర్శనం షట్చక్ర భేదన చేసిన మహా యోగులే చేయగలరు. మహాబలి కరుణకు నోచుకున్న సిద్ధపురుషులే త్రికాలరహస్య దర్శనం చేయించగలరు' సమర్థ రాముడి కంఠం మేను పులకింపజేస్తూ వినిపించింది.

వీణ మెట్లను అవరోహణ క్రమంలో మీటుతున్నట్లు, సమర్థరాముడి కుడిచేతి చూపుడు వేలు, బొటన వేలు కృష్ణరాయల మాడు నుండి వెన్నుపూస చివరి వరకూ నాట్యం చేశాయి. మెరుపు కాంతులు, తెలుపు, నలుపు, నీలం, బంగారు, సిందూర, రక్త(ఎరుపు) కాంతులు మాడునుండి వెన్నుపూస చివరి వరకూ మెరిశాయి. శరీరమంతా దివ్యమైన పరిమళాలు అలుముకున్నాయి. కాంతులు మందగించిన కొన్ని క్షణాల వరకూ తొలకరిలో తడిసిన మట్టి వాసన మధురంగా నాసికకు సోకింది.

మృదువుగా కృష్ణరాయల గుండె మీద, వీపు మీద నిమిరి 'ఇక కనులు తెరిచి బయటకు రా కృష్ణోబా!' అని ఆజ్ఞ ఇచ్చాడు సమర్థరాముడు. నెమ్మదిగా కనులు తెరిచిన కృష్ణరాయలకు సమర్థ రాముడు కన్నులు చేసుకున్న పుణ్యంలా వీరాసనంలో కనిపించాడు. ఆయనకు రెండు వైపులా చేతులు కట్టుకుని కదలకుండా కనకదుర్గ ఆలయ మంటపంలోని స్తంభాలలా ఆయన శిష్యులు కనిపించారు.

'ఇక బయలుదేరుదాము కృష్ణోబా! శుభ పరంపరలు ఎదురు చూస్తున్నాయి! ఛత్రపతి రాకకు సమయం దగ్గర పడింది. ఏర్పాట్లు వేగిరం చేయాలి' అంటూ శిష్యులను చూస్తూ తల పంకించాడు సమర్థరాముడు. కనకదుర్గమ్మ ధ్వజస్తంభపు గంటలు గాలి వాలున శరీరాలు మురిసేలా చెవులకు సోకాయి. వెనువెంట అమ్మవారి ఆలయ శంఖ నాదం వినిపించింది మంగళం కలుగు గాక అంటూ. జోడుగా ఈ ఒడ్డు నుండి మంగళగిరి నరసింహుడి ఆలయం నుండి దివ్య శంఖ నాదం వినిపించింది ఆశీస్సులందజేస్తూ.

(భవానీద్వీపం నవల సమాప్తం)

COMMENTS